సాక్షి
వరంగల్
గురువారం । 10 । ఏప్రిల్ । 2025



మరోసారి మెరిసిన మరియపురం

గీసుకొండ మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామం మరియపురం మరోసారి మెరిసింది. సుస్థిర అభివృద్ధిలో రాష్ట్రంలోని టాప్‌టెన్ పంచాయతీల్లో ఒకటిగా నిలిచింది.

- 8లో▸



మిడ్కో కథలు చిరస్మరణీయం

దేశంలో దోపిడీ వ్యవస్థ నిర్మూలనకు మిడ్కో కథలు చిరస్మరణీయమని పౌరహక్కుల సంఘం, ఏఎస్సీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$38^{0}/25^{0}$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఎండ ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతతోపాటు వేడి ఉంటుంది. రాత్రి సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలి



సంగెం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పల్లె దవాఖానల వైద్యసిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు సేవలందించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సాంబశివరావు సూచించారు. తీగరాజుపల్లిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం (పల్లె దవాఖాన)ను బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని, మాతాశిశు సంరక్షణ, ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలను ప్రోత్సహించాలని, వ్యాధి నిరోధక టీకాలు అందించాలని ఆదేశించారు. సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేయించి తగిన చికిత్సలు అందించాలని, వేసవిలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పల్లె దవాఖాన వైద్యాధికారి లావణ్య, ఏఎన్ఎం సునంద, కవితాకుమారి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య జిల్లాగా మార్చాలి



వరంగల్: వేసవికాలంలో ఆరోగ్య సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ మాస్ మీడియా అధికారి అనిల్‌కుమార్ సూచించారు. పైడిపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రొటీన్ ఇమ్యునైజేషన్ సెషన్‌ను బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఓఆర్ఎస్ కార్నర్ నిర్మించాలని, ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చినా తగిన చికిత్స అందించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని, ఆశ కార్యకర్త నుంచి అందరూ సమన్వయంతో పనిచేసి తగిన ఫలితాలు రాబట్టి, వరంగల్‌ను ఆరోగ్య జిల్లాగా మార్చడానికి ప్రయత్నం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త యశోద, ఆశ కార్యకర్తలు తిరుపతమ్మ, యశోద, జ్యోతి, అనిత, ప్రభ, పద్మ, సుమలత, గాయత్రి పాల్గొన్నారు.

టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్‌గా తీగల రాజేశ్‌గౌడ్



సంగెం: టీపీసీసీ లీగల్, హ్యూమన్ రైట్స్, ఆర్టీఐ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కన్వీనర్‌గా చింతలపల్లి గ్రామానికి చెందిన తీగల రాజేశ్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ ఆయనకు నియామకపత్రం అందజేశారు. హైకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న రాజేశ్ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి బాధ్యతలు అప్పగించారు.

రిజిస్ట్రేషన్లకు ఇబ్బందులు

నేటి నుంచి కొత్త పద్ధతిలో స్లాట్ బుకింగ్

వరంగల్: రిజిస్ట్రేషన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త నిబంధనలతో బుధవారం వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పలు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ నిబంధన ప్రకారం స్లాట్ల బుకింగ్ చేసుకున్న వారికి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిమిషాల్లోనే పూర్తిచేసే విధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా పైలట్ ప్రాజెక్టు కింద జిల్లాలోని వరంగల్, ఖిలావరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈపద్ధతి అమలు చేయనున్నారు. గురువారం నుంచి ఈ రెండు కార్యాలయాల్లో కొత్తగా నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్లు చేయనున్నారు. గతంలో డాక్యుమెంట్లలో ఏమైనా తప్పులు ఉంటే కార్యాలయంలో సరిదిద్దేందుకు ఎడిట్ ఆప్షన్ ఉండేది. కొత్త పద్ధతి ప్రకారం ఈ ఆప్షన్‌ను తొలగించారు. స్లాట్ల బుకింగ్ సమయంలో నమోదు చేసిన వివరాలతోనే రిజిస్ట్రేషన్లు జరగనున్నాయి. ఒకవేళ ఏదైనా తప్పుగా నమోదు చేస్తే సదరు రిజిస్ట్రేషన్‌దారుడు మళ్లీ కొత్తగా స్లాట్ బుకింగ్ చేసుకుంటేనే లావాదేవీలు పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయని కార్యాలయ వర్గాలు తెలిపాయి.

మామిడి..తగ్గిన దిగుబడి

ఈ సంవత్సరం 75 శాతం కాయలు రాని పరిస్థితి

- రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి నష్టపోయిన రైతులు
- సర్వే చేసి ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి
- జిల్లాలో 1,508 మంది రైతులు.. 5,960 ఎకరాల్లో సాగు



- నర్సంపేట నియోజకవర్గంలోని నల్లబెల్లి మండలం కన్నారావుపేట గ్రామానికి చెందిన ఈ రైతు పేరు వేముల సంపత్‌రెడ్డి. కన్నారావుపేట గ్రామంలో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో మామిడి తోటను ఆరు సంవత్సరాలుగా పెంచుతున్నాడు. రెండు సంవత్సరాలు ఆశాజనకంగానే దిగుబడి వచ్చింది. కానీ, ఈ ఏడాది సమీపంలోని మరో ఎకరం మామిడి తోటను కౌలుకు తీసుకున్నాడు. ఇప్పటివరకు రూ.75 వేల పెట్టుబడి పెట్టినా కాయ అంతంత మాత్రంగానే వచ్చింది. రూ.25 వేలు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. ఇది ఒక సంపత్‌రెడ్డి పరిస్థితే కాదు.. జిల్లాలో మామిడి తోటలను పెంచుతున్న అనేక మంది రైతులు ఈ సమస్య ఎదుర్కొంటున్నారు.



నల్లబెల్లిలో నేలరాలిన మామిడి కాయలను చూపిస్తున్న రైతు

జిల్లాలో మూడు సంవత్సరాలుగా మామిడి సాగు వివరాలు..

మండలం	రైతులు	ఎకరాలు
వర్ధన్నపేట	629	2,829.07
రాయపర్తి	239	1,099.07
పర్వతగిరి	349	1,249.18
ఖిలా వరంగల్	70	209.34
సంగెం	48	146.11
నల్లబెల్లి	38	130.34
నెక్కొండ	25	88.25
నర్సంపేట	39	84.32
గీసుకొండ	42	56.04
చెన్నారావుపేట	11	29.28
ఖానాపురం	6	17.29
వరంగల్	5	5.16
దుగ్గొండి	7	13.02

నర్సంపేట: జిల్లాలో నాలుగు సంవత్సరాలుగా మామిడి రైతుకు నష్టాలు తప్పడం లేదు. కోటి ఆశలతో మామిడి తోటలను పెంచుతున్న రైతులకు ఒక ఏడాది దిగుబడి రాకపోవడం, మరో ఏడాది ప్రకృతి వైపరీత్యాలు తప్పడం లేదు. మంచిగా దిగుబడి వచ్చిన సంవత్సరం ధరలు అంతంత మాత్రంగా ఉంటున్నాయి. జిల్లాలో 1,508 మంది రైతులు 5,960 ఎకరాల్లో మామిడి తోటలను సాగు చేశారు.దీని ద్వారా 14,897మెట్రిక్ టన్నుల కాయ దిగుబడి రావాల్సి ఉంది. ఈ క్రమంలోనే సోమవారం, మంగళవారం వచ్చిన గాలి బీభత్సానికి 10,500 మెట్రిక్ టన్నుల కాయ రాలిపోయింది. దీంతో మామిడి రైతులు కోలుకోలేని విధంగా నష్టపోయారు.

ఎకరాకు రూ.20 వేల అదనపు ఖర్చు.

రైతులు ఎకరం మామిడి తోటను రూ.30 వేల నుంచి రూ.50 వేలు చెల్లించి కౌలుకు తీసుకుని పూత దశ నుంచి క్రిమిసంహారక మందులు స్ప్రే చేస్తున్నారు. అధిక కాత కోసం సస్యరక్షణ చర్యలు తీసుకోవాల్సి రావడంతో ఎకరాకు 20 వేల రూపాయల వరకు అదనంగా ఖర్చు వస్తోంది. దిగుబడి వచ్చే సమయంలో గాలి వానలు, వడగళ్ల వానలు వచ్చి ఉన్న కొద్దిపాటి కాయను నేలమట్టం చేస్తున్నాయి. దీంతో ప్రతీసారి మామిడి సాగుపై ఆశతో ఉన్న రైతులకు నష్టాలు వస్తున్నాయి.

పూత నిలువక.. కాత కాయక..

గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈ సంవత్సరం మామిడి తోటలకు మొదట్లో పూత మంచిగానే వచ్చింది. కానీ, పూత నిలువకపోవడంతో 75 శాతం కాయలు కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. జిల్లాలోని పర్వతగిరి, వర్ధన్నపేట, రాయపర్తి, నర్సంపేట, నెక్కొండ, మండలాల్లో మామిడి తోటల పరిస్థితి దయనీయంగా ఉంది. దిగుబడి తగ్గడంతో ఈసారి మామిడికి ధర కూడా ఎక్కువగానే ఉండే అవకాశం ఉంది.

40 ఎకరాలు కౌలుకు తీసుకున్న..



10 సంవత్సరాలుగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో మామిడి తోటలు లీజుకు తీసుకుంటున్న. ఈ ఏడాది కూడా 13 ప్రాంతాల్లో రూ.5 లక్షలు వెచ్చించి 40 ఎకరాలను కౌలుకు తీసుకున్న. అప్పు తెచ్చి పెట్టుబడి పెట్టి కంటికి రెప్పలా కాపాడుకున్న. మరో 10 రోజులు అయితే మామిడి కాయలు అమ్ముకుంటే రూ.6 లక్షలు వచ్చేవి. రెండు రోజుల క్రితం వచ్చిన ఈదురు గాలులకు 70 శాతం కాయ రాలిపోయింది. బుధవారం వరంగల్ మార్కెట్‌లో రాలిన కాయలను అమ్మితే రూ.50 వేలు వచ్చాయి. ఈసారి భారీగా నష్టపోయాను. ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోవాలి. - గొని నవీన్, మామిడి రైతు

డివిజన్‌లో 87 ఎకరాల్లో నష్టం



సోమవారం, మంగళవారం వచ్చిన తీవ్రమైన గాలులకు నర్సంపేట డివిజన్‌లో 87 ఎకరాల్లో మామిడి తోటలకు నష్టం వాటిల్లింది. తోటల్లో కాయలు రాలిపోయి రైతులు నష్టపోయారు. డివిజన్‌తోపాటు జిల్లాలోని ఇతర మండలాల్లో కూడా నష్టపోయిన పంటల వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు పంపిస్తున్నాం.
- జ్యోతి, హార్టికల్చర్ అధికారి

సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ సత్యశారద, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి
- కొలనుపల్లిలో పెద్దసోమయ్య–రాజనర్సమ్మ ఇంట్లో సహపంక్తి భోజనం



కొలనుపల్లిలో సహపంక్తి భోజనం చేస్తున్న కలెక్టర్ సత్యశారద, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

రాయపర్తి: సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సత్యశారద, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి కోరారు. కొలనుపల్లి గ్రామంలోని చిట్యాల పెద్దసోమయ్య–రాజనర్సమ్మ దంపతుల ఇంట్లో బుధవారం వారు సన్నబియ్యంతో వండిన భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం రేషన్‌షాపుల ద్వారా ప్రజలకు సన్నబియ్యం పంపిణీ చేస్తోందని పేర్కొన్నారు. అనంతరం వారు పెద్దసోమయ్య–రాజనర్సమ్మ దంపతులకు నూతన వస్త్రాలను అందజేశారు. అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, డీసీఓ నీరజ, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ సంధ్యారాణి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల సంక్షేమమే ధ్యేయం

అన్నదాతల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రం,బురహాన్‌పల్లి,కొలన్‌పల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సత్యశారదతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని కోరారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ సంధ్యారాణి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ కిషన్, ఎంపీఓ ప్రకాశ్, ఏఓ వీరభద్రం, పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ తొర్రూరు అధ్యక్షుడు హామ్యా నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య, వైస్‌చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వ్యాపారిపై చర్య తీసుకోవాలి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్



రైతు మల్లయ్యతో మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

నర్సంపేట రూరల్: మొక్కజొన్న పంటను ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించిన వ్యాపారిపై చర్య తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్, తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఈర్ల పైడి, అధ్యక్షుడు బుర్ర ఆనంద్ డిమాండ్ చేశారు. బుధవారం భాంజీపేట గ్రామానికి చెందిన రైతు పిట్టల మల్లయ్యతో వారు మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు సంఘనాయకులు మాట్లాడుతూ చంద్రయ్యపల్లి గ్రామానికి ఓ ఫర్టిలైజర్ వ్యాపారి వద్ద నాలుగు సంవత్సరాలుగా మల్లయ్య పురుగుల మందులు తీసుకొచ్చి పంటలకు స్ప్రే చేస్తున్నాడు. దీంతో ఆయన రూ.20 వేలు సదరు వ్యాపారికి చెల్లించాల్సి ఉంది. కొంతమందిని తీసుకొచ్చి కల్లం వద్ద ఆరబెట్టిన మొక్కజొన్న పంటను వ్యాపారి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా మల్లయ్య అడ్డుకున్నాడు. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వారు పేర్కొన్నారు. తక్షణమే వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాస్‌లైన్ రైతు కూలీ సంఘం డివిజన్ నాయకులు అడ్డూరి రాజు, తెలంగాణ రైతుకూలీ సంఘం నాయకులు భూమా అశోక్, ఈరెల్లి రాంచందర్, శివరాత్రి కుమారస్వామి, ఎలకంటి కుమారస్వామి, ఓదెల రాజయ్య, లింగయ్య పాల్గొన్నారు.

‘టెన్త్’ మూల్యాంకనంలో నిర్లక్ష్యం

ఇద్దరు స్కూల్ అసిస్టెంట్ల రిలీవ్

- చెప్పకుండా క్యాంపు నుంచి వెళ్లిన మరో టీచర్
- చర్యలు తీసుకోవాలని డీఈఓలకు సమాచారం

విద్యారణ్యపురి: హనుమకొండలోని కాజీపేట ఫాతిమా హైస్కూల్‌లో ‘టెన్త్’ మూల్యాంకనం కొనసాగుతోంది. ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లు అసిస్టెంట్ ఎగ్జామినర్లు (ఏఈ)గా మూల్యాంకనంలో భాగంగా మార్కులు పోస్టింగ్ చేయడంలో పొరపాట్లు చేస్తున్నారు. స్క్రూటినీలో ఆయా పొరపాట్లు గుర్తించి సక్రమంగా మూల్యాంకనం చేయాలని చీఫ్ ఎగ్జామినర్, ఇతర సిబ్బంది సూచించినా అలాగే నిర్లక్ష్యం చేస్తుండడంతో వారిని విధుల నుంచి టెన్త్ స్పాట్ క్యాంపు ఆఫీసర్, డీఈఓ వాసంతి రిలీవ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్‌కు మూల్యాంకనం విధులు అప్పగించగా మంగళవారం నిర్లక్ష్యం వహించారు. విద్యార్థుల జవాబుపత్రాల్లో మార్కుల పోస్టింగ్‌లో పొరపాట్లు చేస్తున్నట్లు స్క్రూటినీలో గుర్తించారు. సక్రమంగా చేయాలని సూచించినా బుధవారం కూడా అదేమాదిరి చేయడంతో అతడు చేసిన జవాబుపత్రాలను క్యాంపు ఆఫీసర్‌కు వాసంతికి చూపించారు. దీంతో అతడిని వెంటనే రిలీవ్ చేశారు. అలాగే, జయశంకర్ భూపాలపల్లిజిల్లాలో బయోసైన్స్‌స్కూల్ అసిస్టెంట్ కూడా సోమవారం ఏఈగా మూల్యాంకనం విధుల్లో చేరారు. సరిగా చేయకపోవడంతో గుర్తించి సంబంధిత సీఈ, ఇతర సిబ్బంది చెప్పినా మార్కుల పోస్టింగ్‌లలో పొరపాట్లు చేస్తుండగా రెండురోజులు అలాగే తప్పులు చేస్తుండడంతో పరిశీలించి మంగళవారం రిలీవ్ చేశారు. ఆయా ఇద్దరు స్కూల్‌అసిస్టెంట్లపై చర్యలు తీసుకోవాలని డీఈఓ వాసంతి గురువారం జయశంకర్ భూపాలపల్లి డీఈఓకు లిఖితపూర్వక సమాచారం పంపనున్నారు. వీలైతే సస్పెండ్‌చేయాలనేది ఆదేశించనున్నారనేది చర్చ జరుగుతుంది.

చెప్పకుండా విధుల నుంచి వెళ్లిన టీచర్

మహబూబాబాద్ జిల్లాలో ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ మంగళవారం ఫాతిమా హైస్కూల్ స్పాట్ క్యాంపు వద్దకు వచ్చారు. తనకు విధులు అప్పగిస్తే అసిస్టెంట్ ఎగ్జామినర్‌గా మూల్యాంకనం చేస్తానని చెప్పగా అక్కడ సంబంధిత అధికారులు అతడికి విధులు అప్పగించారు. పది జవాబుపత్రాలు మూల్యాంకనం చేశాక మంగళవారం మధ్యాహ్నం ఎవరికి చెప్పకుండా క్యాంపు నుంచి వెళ్లిపోయాడు. దీంతో సంబంధిత సిబ్బంది అతడికి ఫోన్ చేస్తే స్విచాఫ్ వచ్చింది. బుధవారం కూడా క్యాంపునకు రాలేదు. ఫోన్‌లో సంప్రదించే యత్నం చేసినా అందుబాటులోకి రావడం లేదు. ఈ విషయం డీఈఓ వాసంతికి తెలియజేయగా మహబూబాబాద్ డీఈఓకు కూడా సంబంధిత టీచర్‌పై సమాచారం ఇచ్చారు. అలాగే, అతడిపై చర్యలు తీసుకోవాలని గురువారం లిఖితపూర్వకంగా మహబూబాబాద్ డీఈఓకు పంపనున్నారు. అతడిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

బదిలీల కలకలం!



వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో మళ్లీ బదిలీల కలకలం మొదలైంది. వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లోని పలువురు ఏసీపీలు, ఎస్‌హెచ్‌ఓలు, ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం తప్పదన్న చర్చ జరుగుతోంది. ఇతర జిల్లాల్లో పని చేస్తున్న పలువురు అధికారులు ఇప్పటికే ప్రజాప్రతినిధుల ఆశీస్సులు పొందడంతోపాటు ఉన్నతాధికారులకు సిఫార్సు చేయించుకున్నారు.

పోలీసుశాఖలో మళ్లీ ట్రాన్స్‌ఫర్లు

- త్వరలోనే కొందరు ఏసీపీలు, ఎస్‌హెచ్‌ఓలకు స్థానచలనం?
- కీలక ఠాణాల కోసం ఎవరికి వారుగా ప్రయత్నాలు
- పోస్టింగ్‌లకు ప్రజాప్రతినిధుల సిఫారసులే కీలకం..
- పోలీసుశాఖపై పట్టు బిగిస్తున్న సీపీ.. తనిఖీలు, సమీక్షలతో బిజీబిజీ

సాక్షిప్రతినిధి, వరంగల్: రాష్ట్ర వ్యాప్తంగా నెల రోజుల క్రితం ఐపీఎస్ అధికారుల మూకుమ్మడి బదిలీలు జరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా రామగుండం కమిషనర్‌గా బదిలీ కాగా.. ఆయన స్థానంలో సన్‌ప్రీత్‌సింగ్ బాధ్యతలు చేపట్టారు. సమీక్షలు, సమావేశాలు, ఠాణాల ఆకస్మిక సందర్శనలతో బిజీబిజీగా ఉన్న పోలీస్ కమిషనర్.. కమిషనరేట్ పోలీసింగ్‌పై తనదైన మార్కు వేస్తున్నారు. ఇదే సమయంలో లాంగ్ స్టాండింగ్‌తో పాటు వివాదాస్పద పోలీసు అధికారులు కొందరికి స్థానచలనం తప్పదన్న ప్రచారంతో ఆశావహులు సిఫారసులకు పోటీపడడం చర్చనీయాంశం అవుతోంది.

వివాదంగా పలు విభాగాలు..

పోలీస్ కమిషనరేట్‌లో శాంతిభద్రతలతో పాటు స్పెషల్ బ్రాంచ్, టాస్క్‌ఫోర్స్, క్రైమ్స్ తదితర విభాగాలు కీలకంగా వ్యవహరిస్తున్నాయి. అయితే ఈ విభాగాల్లో పనిచేస్తున్న కొందరు తమ పనులు కాకుండా ఇతరుల విధుల్లో జోక్యం చేసుకుంటూ చికాకు కలిగిస్తున్నారన్న చర్చ ఉంది. వివిధ స్థాయిల్లోని అధికారులు కొందరు తమ సన్నిహితులతో బహిరంగంగానే చర్చిస్తున్నారు. ప్రధానంగా నగరంలో కాసులు కురిపించే ‘భూదందా’ల్లో మితిమీరిన జోక్యంపై ఆయా శాఖల అధికారులు నొచ్చుకుంటున్నారు. ఇదిలా ఉండగా వరంగల్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న కొందరు ఏసీపీలు, ఎస్‌హెచ్‌ఓలపై సీపీ, డీజీపీ వరకు ఫిర్యాదులు వెళ్లాయన్న చర్చ జరుగుతోంది. కీలక ప్రజాప్రతినిధి, కుటుంబసభ్యుల అండదండలున్న ఓ ఏసీపీ తన పరిధిలోని ఠాణాలకు ఎస్‌హెచ్‌ఓలను రాకుండా జాగ్రత్త పడుతున్నారన్న ప్రచారం ఉంది. ఆ అధికారి పరిధిలోని ఓ ఠాణా ఎస్‌హెచ్‌ఓ ఓ హోంగార్డుతోపాటు క్రైం హెడ్‌కానిస్టేబుళ్ల ద్వారా లావాదేవీలు జరుపుతున్నారన్న చర్చ బహిరంగంగా సాగుతోంది. కమిషనరేట్ పరిధిలోని మరో ఏసీపీ పెద్ద మొత్తంలో డబ్బులు ముట్టజెప్పి పోస్టింగ్ పొందారన్న ప్రచారం పోలీస్ శాఖలో హాట్‌టాఫిక్‌గా మారింది. వరంగల్ నగరంలోని నాలుగు ఠాణాల్లో నిత్యం భూదందాలు, సెటిల్‌మెంట్లు జరుగుతున్నాయన్న ఫిర్యాదులు ఉన్నతాధికారుల వరకు వెళ్లగా.. ఓ ఠాణాలో 25 తులాలకుపైగా బంగారం రికవరీ కేసులో ‘ఖర్చు’ల కింద పెద్ద మొత్తంలో వసూలు చేయడంపై ఆరా తీస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. సిబ్బందిపై బూతు పురాణం.. ఫోన్ పే ద్వారా డబ్బుల స్వీకరణ.. ‘మీరేమన్న చేసుకోండి నాకింతివ్వండి’ అంటూ ఎస్సైలకు టార్గెట్ విధించారన్న ఆరోపణల్లో ముగ్గురు ఎస్‌హెచ్‌ఓలపైనా శాఖాపరమైన విచారణ చేపట్టినట్లు సమాచారం.

గ్రేటర్ ఠాణాలపైనే అందరి గురి..

గ్రేటర్ వరంగల్ కమిషనరేట్ పోలీస్‌స్టేషన్లలో పనిచేసేందుకు కొందరు అధికారులు.. త్వరలో జరిగే బదిలీల కోసం ఇప్పటి నుంచే ఖర్చీఫ్‌లు వేసుకుంటున్నారు.ప్రజాప్రతినిధులకు సన్నిహితులై ఉమ్మడి వరంగల్‌తో పాటు మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో పనిచేస్తున్న వారు గ్రేటర్ వరంగల్ ఠాణాలపై గురి పెట్టారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో పని చేస్తున్న ఓ ఏసీపీ గ్రేటర్ పరిధిలో పోస్టింగ్ కోసం పొరుగు జిల్లాలోని ఓ సీనియర్ మంత్రితో స్థానిక ప్రజాప్రతినిధులకు సిఫారసు చేయించుకున్నట్లు తెలిసింది. వివిధ విభాగాల్లో పని చేస్తున్న కొందరు ఏసీపీలు సైతం ప్రధానమైన డివిజన్లపై గురిపెట్టినట్లు ప్రచారం జరుగుతుండగా, అందులో ఒక్కరిద్దరికి హామీ కూడా లభించినట్లు చెబుతున్నారు. కాగా, హనుమకొండ, కేయూసీ, హసన్‌పర్తి, సుబేదారి, కాజీపేట, హసన్‌పర్తి, మట్టెవాడ.. నగరం చుట్టూ ఉన్న ధర్మసాగర్, ఆత్మకూరు, గీసుకొండ, వర్ధన్నపేట, ఎల్కతుర్తి తదితర ఠాణాల పోస్టింగ్‌లు పట్టేందుకు పోటాపోటీగా ఇన్‌స్పెక్టర్లు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో కొన్ని ఠాణాలకు ఎస్‌హెచ్‌ఓలు చేరి ఏడాదైనా కాకపోయినప్పటికీ.. వివిధ కారణాలతో స్థానచలనం తప్పదన్న సమాచారంతో ఖర్చీఫ్‌లు వేసుకుంటుండటం పోలీసుశాఖలో చర్చనీయాంశంగా మారింది.

ఉద్యోగ అవకాశాలు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్: మామునూరు ఎయిర్‌పోర్ట్, కాకతీయ మెగాటెక్స్ టైల్ పార్కు, గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణాల్లో భూములు కోల్పోయిన తమకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని భూనిర్వాసితులు కలెక్టర్ డాక్టర్ సత్యశారదను కోరారు. కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన బుధవారం జరిగిన జిల్లాస్థాయి సంప్రదింపుల సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఎయిర్‌పోర్ట్‌కు సంబంధించి ఖిలా వరంగల్ మండలంలోని నక్కలపల్లి, గుంటూరుపల్లి, గాడిపల్లి గ్రామాల భూనిర్వాసితులతో జనరల్ అవార్డు,కన్సర్న్ అవార్డులపై చర్చించా రు.ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో భూములు కోల్పోతు న్న తమకు అధిక ధర కావాలని,రోడ్డు సౌకర్యం కావాలని నిర్వాసితులు కోరారు. నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోతున్న సంగెం మండలం చింతలపల్లి భూనిర్వాసితులతో ఆర్బిట్రేషన్ నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్లు నాగేశ్వరరావు, రాజ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఉద్యమాలను ఉధృతం చేయాలి



మాట్లాడుతున్న పెద్దారపు రమేశ్

నర్సంపేట: పంటల మద్దతు ధర, రుణ విముక్తి చట్టానికి రాజకీయాలకతీతంగా ఐక్య ఉద్యమాలను ఉధృతం చేయాలని ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేశ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు అఖిల భారత రైతు సమాఖ్య(ఏఐకేఎఫ్), జమ్మూరి కిసాన్ సభ (జేకేఎస్) ఉమ్మడి జాతీయ సమావేశాలు పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్ పట్టణంలో రెండు రోజులపాటు జరిగాయి. ఈ సందర్భంగా కొలనూరు ప్రాంతంలో ఏర్పాటు చేసిన రైతు ఉద్యమ ముఖ్య కార్యకర్తల సభలో ఆయన మాట్లాడారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



భూమి పూజచేస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నల్లబెల్లి: రైతు సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. కొండాపూర్‌లో రూ.2.63 కోట్లతో చేపట్టిన 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎన్పీడీసీఎల్ సీఈలు రాజుచౌహాన్, జవంత్ చౌహాన్‌తో కలిసి ఎమ్మెల్యే బుధవారం భూమి పూజ చేశారు. సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాధవరెడ్డి మాట్లాడారు. విద్యుత్ అవసరాలు తీర్చేందుకు, లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. మురళీనగర్, గణేశ్‌నగర్ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని, కొండాపూర్ చెరువును గోదావరి జలాలతో నింపాలని, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ప్రజలు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. కాగా, త్వరలోనే ఈ సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, ఎన్పీడీసీఎల్ వరంగల్ ఎస్ఈ గౌతంరెడ్డి, నర్సంపేట డీఈలు హర్షి, తిరుపతి, ఏడీఈ లక్ష్మణ్, తహసీల్దార్ ముప్పు కృష్ణ, ఎంపీడీఓ నర్సింహమూర్తి, ఏఈ హరిబాబు, ప్రత్యేక అధికారి పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

బాలలు నేరాలకు పాల్పడకుండా చూడాలి : ఏసీపీ



మాట్లాడుతున్న ఏసీపీ నందిరాంనాయక్

వరంగల్: బాలలు నేరాలకు పాల్పడకుండా చూడాలని వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ అన్నారు. అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో ఆటోనగర్ కొత్తవాడలోని ప్రభుత్వ బాలల పరిరక్షణ గృహం (అబ్జర్వేషన్ హోం) ఆవరణలో ‘నేడు సమాజంలో బాలల నేరాల నివారణ’పై బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రతీ బాలుడు తన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు గౌరవం ఇవ్వాలని అన్నారు. ఒక బాలుడు నేరంలో పాల్గొన్నప్పుడు అతని కుటుంబ సభ్యులు కూడా సమాజంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారని పేర్కొన్నారు.

క్లుప్తంగా

భర్త వేధింపులతో వివాహిత బలవన్మరణం

● మద్దులపల్లిలో ఘటన



కూతురుతో రజిత (ఫైల్)

కాటారం: భర్త వేధింపులు తట్టుకోలేక ఓ వివాహిత ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని మద్దులపల్లికి చెందిన పిట్టల శంకర్‌కు, మహాముత్తారం మండలం మహబూబ్‌పల్లికి చెందిన పిట్టల రజిత(25)కు ఏడున్నరేళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ దంపతులకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వివాహం జరిగినప్పటి నుంచి శంకర్.. తల్లి లింగమ్మ, అన్న కిష్టస్వామి, అక్క లక్ష్మి చెప్పి నట్లు వింటూ భార్య రజితపై అనుమానం పెంచుకున్నాడు. వివాహేతర సంబంధాలు అంటగడుతూ నిత్యం మద్యం తాగొచ్చి రజితను కొడుతున్నాడు. దీనిపై రజిత కుటుంబీకులు పెద్దమనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు నిర్వహించినా శంకర్‌లో మార్పు రాలేదు. రజిత తండ్రి మారయ్య ఆరోగ్యం బాగోలేదని ఇటీవల తమ్ముడు రఘుపతిని పంపించినప్పటికీ ఆమెను పుట్టింటికి పంపించకపోగా రజిత, ఆమె తమ్ముడిపై శంకర్ దాడి చేశాడు. ఈ క్రమంలో భర్త అనుమానం, వేధింపులతో మనస్తాపానికి గురైన రజిత బుధవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతురాలి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై-2 శ్రీనివాస్ తెలిపారు.

ట్రేడింగ్ కంపెనీలో చోరీ..

● రూ.9.60లక్షల అపహరణ



డబ్బు తీసుకెళ్తున్న దుండగుడు (సీసీ ఫుటేజీ)

కేసముద్రం: ఓ ట్రేడింగ్ కంపెనీలో చోరీ జరిగింది. రూ.9.60 లక్షలు అపహరణకు గురయ్యాయి. ఈ ఘటన మున్సిపాలిటీ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్ రాజు కథనం ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని మార్కెట్ రోడ్‌లో గల మహాలక్ష్మి ట్రేడింగ్ కంపెనీ వ్యాపారి గార్లపాటి ప్రమోద్ మంగళవారం రాత్రి ఎప్పటిలాగే తన క్యాష్ కౌంటర్‌కు తాళం వేశాడు. అనంతరం వెనుక ఉన్న షెట్టర్ మూసి తాళం వేయకుండా భవనంపైనున్న తన ఇంట్లోకి వెళ్లాడు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారు జామున ఓ దుండగుడు షెట్టర్‌ను పైకి లేపి దుకాణంలోకి ప్రవేశించి కౌంటర్‌లోని రూ.9.60ల క్షలు తీసుకుని పరారయ్యాడు. ఉదయం షాపుకు వచ్చిన యజమాని చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై మురళీధర్‌రాజు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. చోరీకి పాల్పడిన దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదుకాగా, వాటిని పోలీసులు స్వాధీనం చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

మరోసారి మెరిసిన మరియపురం!

9 అంశాల్లో రాష్ట్రంలో టాప్ టెన్‌లో గ్రామం

● 80.71 ఇండెక్స్‌తో రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు
● జిల్లాలో అరుదైన రికార్డు సొంతం
● మాజీ సర్పంచ్ అల్లం బాలిరెడ్డి కృషికి దక్కిన ఫలితం



మరియపురం గ్రామపంచాయతీ



బాలిరెడ్డి, మాజీ సర్పంచ్

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని జాతీయ ఉత్తమ గ్రామపంచాయతీ మరియపురం మరో సారి మెరిసింది. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో 2022-23 నాటికి గ్రామం రాష్ట్రంలోని టాప్ టెన్ పంచాయతీల్లో ఒకటిగా నిలిచింది. కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ రెండు రోజుల క్రితం విడుదల చేసిన 'పంచాయతీ పురోగతి సూచిక'లో గ్రామ మాజీ సర్పంచ్ అల్లం బాలిరెడ్డి కృషి ఫలితంగా జిల్లాతో పాటు రాష్ట్రంలోనూ ప్రశంసనీయమైన సూచీ సాధించడం విశేషం. దేశంలో పురోగతి సూచిక కోసం 2.55 లక్షల పంచాయతీలు దరఖాస్తు చేసుకోగా అందులో మరియపురం టాప్ టెన్‌లో నిలిచింది. తెలంగాణ రాష్ట్రంలో 270 గ్రామాలు 'ఫ్రంట్ రన్నర్'గా(75-90 శాతం) నిలువగా అందులో మరియపురం టాప్ టెన్‌లో 8వ స్థానంలో నిలిచింది. తెలంగాణలో టాప్ 25 గ్రామాల్లో జిల్లా నుంచి మరియపురం నిలవడం గొప్ప విజయంగా చెబుతున్నారు. మాజీ సర్పంచ్ అల్లం బాలిరెడ్డి దూర దృష్టితో ఇప్పటికే గ్రామం సుమారు 25 మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు 25 దక్కించుకోవడం గమనార్హం.

జిల్లా, రాష్ట్ర స్థాయిలో సాధించిన పంచాయతీ ఇండెక్స్(పీఏఐ)

అంశం	జిల్లా స్థాయి సూచీ	రాష్ట్ర స్థాయి సూచీ
జీవనోపాధుల పెంపు	89.03	93.98
ఆరోగ్యం	96.88	99.91
చిన్నారులకు అనుకూలమైన సౌకర్యం	82.81	84.09
తాగునీరు	79.38	86.08
పారిశుద్ధ్యం, పచ్చదనం	83.74	85.86
మౌలిక వసతుల్లో స్వావలంబన	69.71	73.15
సామాజిక భద్రత	81.84	85.34
సుపరిపాలన	81.44	81.68
మహిళలకు అనుకూలమైన విధానం	85.74	89.88

కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల ముందస్తు అరెస్టులు



కేయూ పోలీస్‌స్టేషన్‌లో పలువురు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు

●కొందరు ఇక్కడే.. మరికొందరు హైదరాబాద్‌లో..

కేయూ క్యాంపస్: తెలంగాణలోని 12 యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో హైదరాబాద్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ముట్టడికి కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు కాకతీయ యూనివర్సిటీలోని వివిధ కళాశాలలు, విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను ముందస్తు అరెస్టులు చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఇందులో మహిళా ప్రొఫెసర్లు కూడా ఉన్నారు. ప్రధానంగా కేయూ, హనుమకొండ, సుబేదారి తదితర పోలీస్ స్టేషన్లలో ఉంచారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో సుమారు 50 నుంచి 60మంది వరకు అరెస్టు అయిన వారిలో ఉన్నారని సమాచారం. యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్, కేయూ బీసీసెల్ డైరెక్టర్ శ్రీనివాస్, కేయూ పాలకమండలి సభ్యుడు చిర్రరాజు, కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం బాధ్యులు సదాశివ, గడ్డం కృష్ణ తదితరులు ఉన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ముట్టడికి కూడా కొందరు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు వెళ్లారు. అందులో కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌కుమార్ లోథ్, పలువురు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను మిగతా యూనివర్సిటీల కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను అక్కడ పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు.

అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలి

రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో పనిచేస్తున్న 1,270మంది కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజేషన్ చేశాక మిగతా పోస్టుల్లో నియామకాలు చేపట్టాలని, ఇటీవల తీసుకొచ్చిన జీఓ 21ని రద్దుచేయాలని డిమాండ్‌తో ఉన్నత విద్యామండలి కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను అరెస్టు చేశారని, వారిని విడుదల చేయాలని కేయూ కోఆర్డినేషన్ కమిటీ బాధ్యులు సాధురాజేశ్, బి. సతీశ్, మాదాసి కనకయ్య డిమాండ్ చేశారు. అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాగా, గురువారం బంద్ పాటించనున్నట్లు కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర కమిటీ తెలిపింది.

ఇదేనా ప్రజాపాలన..

తెలంగాణ ఏర్పాటుకు కారణమైన యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను అరెస్టు చేయటం సిగ్గుచేటని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఇండ్ల నాగేశ్వర్‌రావు ఒక ప్రకటనలో విమర్శించారు. ఇదేనా ప్రజాపాలనా అని ప్రశ్నించారు. కాంట్రాక్టు అధ్యాపకుల సమస్య పరిష్కారం చూపాకే నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

జాతీయ ఎస్టీ కమిషన్ ఎదుట మహబూబాబాద్ కలెక్టర్

● కునాయికుంట కబ్జాపై విచారణకు ఢిల్లీలో హాజరు



జాతీయ ఎస్టీ కమిషన్ ఎదుట కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

సాక్షి, మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రత్తిరాంతండాలోని కునాయికుంట కబ్జా విషయంలో ఓ మాజీ ప్రజాప్రతినిధి జాతీయ ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించాడు. కమిషన్ ఆదేశాల మేరకు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ బుధవారం ఢిల్లీలో కమిషన్ ఎదుట హాజరయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి.. రత్తిరాంతండా పరిధిలోని కునాయికుంటను గత ప్రభుత్వం హయాంలో కొంతమంది అక్రమంగా కబ్జా చేసి.. రెవెన్యూ అధికారుల మద్దతుతో పట్టాదారు పాస్‌బుక్ పొందారు. ఈ విషయం అప్పటి కలెక్టర్, అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదు. 70 ఏళ్ల గిరిజన రైతులకు సాగునీరుకు ఉపయోగపడే కుంటను ఆక్రమించి పట్టాపొందారనే విషయాన్ని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ దృష్టికి మాజీ ఎంపీటీసీ మదన్ తీసుకెళ్లారు. ఫిర్యాదుపై స్పందించిన జాతీయ ఎస్టీ కమిషన్ ఢిల్లీలోని కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని కలెక్టర్‌ను ఆదేశించింది. ఈమేరకు ఆయన హాజరై కమిషన్ అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం చెప్పినట్లు తెలిసింది.

హెచ్‌సీయూ భూములను పరిరక్షించాలి

● ఉమ్మడి ఏపీ హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్

కేయూ క్యాంపస్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను పరిరక్షించాల్సిన అవసరం ఉందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్ అన్నారు. వర్సిటీల భూముల పరిరక్షణపై డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన బుధవారం కాకతీయ యూనివర్సిటీ దూర విద్యాకేంద్రం సెమినార్‌హాల్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సెంట్రల్ యూనివర్సిటీ భూములపై ప్రైవేట్ పెట్టుబడీదారుల కన్నుపడిందని, నాటి చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఐఎంజీ భారత్ అనే కంపెనీకి 400ల ఎకరాల భూమి కేటాయించగా.. తర్వాత పరిణామ క్రమంలో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో ఆ కేటాయింపును రద్దు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం ఉన్నత న్యాయస్థానం 2024లో ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థిస్తూ తీర్పు ఇచ్చినట్లు వివరించారు. ఆ 400 ఎకరాల భూమిని విద్యారంగాభివృద్ధికి వినియోగించాలన్న ఆయన.. బాధ్యత కలిగిన ప్రభుత్వం మళ్లీ ప్రైవేటు కంపెనీలకు అప్పగించడానికి పూనుకోవటం సరికాదన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ వెంకట్‌దాస్ మాట్లాడుతూ హెచ్‌సీయూ విద్యార్థులు భూమి పరిరక్షణకు ఉద్యమిస్తే వారిపై అణిచివేత చర్యలు తగదన్నారు. సమావేశంలో డెమొక్రటిక్ స్టూడెంట్స్ రాష్ట్ర కన్వీనర్ శ్రవణ్, కోకన్వీనర్ గణేష్, ప్రజాసంఘాల బాధ్యులు లింగారెడ్డి, లక్ష్మయ్య, మొయినుద్దీన్, ఓంబ్రహ్మం, వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు బి.నర్సింహారావు, వడ్డెపెల్లి మధు, సంతోష్, రాజేష్, నాగరాజు, స్టాలిన్, వెంకటేష్, శివ పాల్గొన్నారు.

మిడ్కో కథలు చిరస్మరణీయం

● పౌరహక్కుల సంఘం, ఏఎస్‌సీ రాష్ట్ర అధ్యక్షులు గడ్డం లక్ష్మణ్, విమలక్క, వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్
● కడవెండిలో మావోయిస్టు నేత గుమ్ముడవెల్లి రేణుక సంస్మరణ సభ



సంస్మరణ సభకు హాజరైన జనం



రేణుక చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విమలక్క

దేవరుప్పుల : దేశంలో ప్రకృతి సంపదను కొల్లగొట్టే దోపిడీ వ్యవస్థ నిర్మూలన ఉద్యమవ్యాప్తిలో మిడ్కో కథలు ఆచరణాత్మకంగా చిరస్మరణీయమని పౌరహక్కుల సంఘం, ఏఎస్‌సీ రాష్ట్ర అధ్యక్షులు గడ్డం లక్ష్మణ్, విమలక్క, వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్ పేర్కొన్నారు. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు, విప్లవ సాహితి సంపాదకులు గుమ్ముడవెల్లి రేణుక సంస్మరణ సభ బుధవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండిలో అమరుల బంధుమిత్రుల సంఘం అధ్యక్షురాలు బి.పద్మకుమారి అధ్యక్షతన జరిగింది. తొలుత తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య స్మారక స్థూపం వద్ద ఏర్పాటు చేసిన రేణుక చిత్రపటానికి పలువురు విప్లవ జోహార్లు అర్పించారు. అనంతరం 'అందరసొంటి సావు కాదు' శీర్షికన రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ వామపక్ష పార్టీల సిద్ధాంతాలు నిర్వీర్యమయ్యే క్రమంలో ఆవిర్భవించిన నక్సల్స్ ఉద్యమాల వల్లే తెలుగు రాష్ట్రాల్లో భూస్వామ్య, పెట్టుబడిదారి వ్యవస్థ నిర్మూలించే క్రమంలో గిట్టని పాలకవర్గాలు పోలీసుల ఉక్కుపాదం మోపుతూ ప్రజాఉద్యమాలను అణిచివేశారని అన్నారు. ఈ క్రమంలోనే ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల్లో ఆదివాసీల హక్కుల సాధనకు రేణుక నమ్మిన సిద్ధాంతం, మహిళలను చైతన్యవంతుల్ని చేసే క్రమంలో బీజేపీ సర్కార్ ఆపరేషన్ కగార్‌లో అసువులు బాసిందని పేర్కొన్నారు. రేణుక రచనలు భావితరాల ఉద్యమాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయన్నారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి వాస్తవికతపై అధ్యయనం చేసి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రేణుక తల్లిదండ్రులు జయమ్మ, సోమయ్య మాట్లాడుతూ తన కూతురుకు మరణంలేదు.. అక్షర ఉద్యమం ఉన్నంత వరకూ జీవిస్తుందంటూ కంటతడి పెట్టారు. అనంతరం విమలక్క, పల్స నిర్మల, సురేష్ సాంస్కృతిక కళాప్రదర్శనలతో అమరులను స్మరించుకున్నారు. కార్యక్రమంలో రేణుక సోదరులు జీవీకే.ప్రసాద్, రాజశేఖర్, పీఓడబ్ల్యూ నాయకురాలు సంధ్య, విరసం నాయకుడు అరుసవల్లి కృష్ణ, మాభూమి సంధ్య, బల్ల సావిత్రి, గాజర్ల అశోక్ అలియాస్ ఐతు, అమర్, ఏపీటీఎఫ్, టీవీవీ వేదిక, డీటీఎఫ్ రాష్ట్ర నాయకులు ఎర్రంరెడ్డి నర్సింహారెడ్డి, గురజాల రవీందర్, బి.గంగాధర్, ఓయూ జేఏసీ నాయకుడు ఇప్ప పృథ్వీరెడ్డి, సీపీఐ, ఎమ్మార్పీఎస్ నాయకులు బిల్లా తిరుపతిరెడ్డి, జీడి ఎల్లయ్య, పడమటింటి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

తమ్ముడే కాలయముడయ్యాడు..

● మద్యం కోసం డబ్బు ఇవ్వలేదని అన్నను చంపిన తమ్ముడు
● టేకులగూడెంలో ఘటన



విజయ్‌బాబు(ఫైల్)

వాజేడు : సొంత తమ్ముడే కాల యముడయ్యాడు. మద్యం కోసం డబ్బు ఇవ్వలేదనే కారణంతో అన్నను హత్య చేశాడు. అనంతరం తనకేమీ తెలియదన్నట్లు మృతదేహం వద్ద తిరిగాడు. ఈ ఘటన ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని కొత్త టేకులగూడెంలో జరిగింది. వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వాసం అచ్చయ్య, లక్ష్మి దంపతులకు ముగ్గురు కొడుకులు విజయ్‌బాబు(30), బుల్లెబ్బాయి (ఆకాశ్), రాజేంద్రప్రసాద్ ఉన్నారు. ఇద్దరు తమ్ముళ్లకు పెళ్లిళ్లు కాగా పెద్ద కొడుకు విజయ్‌బాబు వివాహం చేసుకోలేదు. అతడు తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. రెండో కొడుకు బుల్లెబ్బాయి(ఆకాశ్) తన భార్య కాన్పు నిమిత్తం తన అత్తగారింటికి వెళ్లగా ఇతను కూడా తల్లిదండ్రుల వద్ద ఉంటున్నారు. ఈ క్రమంలో విజయ్‌బాబు పనికి వెళ్లాడు. మంగళవారం రాత్రి ఇంటికి వచ్చి భోజనం చేసిన అనంతరం నిద్రించాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న బుల్లెబ్బాయి.. అన్న విజయ్‌బాబును మద్యానికి డబ్బు ఇవ్వాలని అడగా అతడు తన వద్ద లేవని చెప్పి నిద్రించాడు. దీంతో కోపోద్రిక్తుడైన బుల్లెబ్బాయి.. విజయ్‌బాబుతో గొడవ పడి పదునైన ఆయుధంతో ముఖంపై కొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన విజయ్‌బాబు మృతి చెందాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం ఉదయం ఘటనా స్థలికి చేరకుని పరిశీలించారు. వివరాలను సేకరించే సమయంలో బుల్లెబ్బాయి అక్కడే ఉండి తనకు ఏమీ తెలియదనట్లు నటించాడు. ఈ ఘటనపై చిన్న తమ్ముడు రాజేంద్రప్రసాద్ ఫిర్యాదు మేరకు బుల్లెబ్బాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ, ఎస్సై తెలిపారు. కాగా, బుల్లెబ్బాయి ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

అప్రమత్తతతో తప్పిన ప్రమాదం



ప్రమాదంలో దగ్ధమవుతున్న టెంట్

స్టేషన్‌ఘన్‌పూర్: జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ స్థానిక బస్టాండ్ సమీపాన నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌యూ కంగన్‌హాల్, గార్మెంట్స్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు. కంగన్‌హాల్‌ను ప్రారంభించి షాపు యజమాని కుటుంబ సభ్యులతో ఫొటోలు దిగుతుండగా షాపు ఎదుట బాణాసంచా కాల్చారు. నిప్పురవ్వలు అక్కడ ఏర్పాటు చేసిన టెంట్‌పై పడటంతో అంటుకుని ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు, పోలీసు సిబ్బంది టెంట్‌ను కిందికి లాగడంతో పాటు నీళ్లు పోసి మంటలు ఆర్పారు. అయితే.. షాపులోకి మంటలు వ్యాపించకుండా ముందు షెట్టర్‌ను మూసివేసి కొద్దిసమయం తర్వాత తెరిచారు. అప్పటి వరకూ ఎమ్మెల్యే షాపు లోపలే ఉన్నారు. ఆయన క్షేమంగా వెళ్లిపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో టెంట్, షాపు ముందు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, షాపు బోర్డు పాక్షికంగా కాలిపోయాయి. కార్యక్రమంలో షాపు యజమాని, కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ నాయకుడు నీల వీరస్వామి, ఏఎంసీ డైరెక్టర్ నీల వెంకటేశ్వర్లు, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు నీల గట్టయ్య, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మమ్మ కర్మకు వస్తూ.. అనంతలోకాలకు

● బైక్‌ను ఢీకొన్న కారు
● మనవడు మృతి.. అతడి భార్య, కొడుకుకు తీవ్ర గాయాలు



నాగేశ్వరరావు(ఫైల్)

బయ్యారం: అమ్మమ్మ కర్మకు వస్తూ మనవడు అనంత లోకాలకు చేరాడు. కారు.. బైక్‌ను ఢీకొన్న ఘటనలో మనవడు మృతి చెందగా అతడి భార్య, కొడుకుకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం మండలంలోని నామాలపాడు సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గూడూరు మండలం వాయిల్‌బంధం గ్రామానికి చెందిన సొక్కం నాగేశ్వరరావు(43) భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలం సారపాక బీపీఎల్‌లో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. నాగేశ్వరరావు తన మేనమామ కుమార్తె సునీతను వివాహం చేసుకోగా వారికి ప్రజ్వల్ సంతానం. ఈ క్రమంలో వాయిల్‌బంధంలో నివసించే అమ్మమ్మ ఆది సత్యమ్మ ఇటీవల మృతి చెందగా పెద్దకర్మకు హాజరయ్యేందుకు భార్య, కుమారుడితో కలిసి నాగేశ్వరరావు బైక్‌పై బయలుదేరాడు. మండలంలోని నామాలపాడు సమీపంలోకి రాగానే ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం ఉసిరికాయపల్లికి చెందిన గుగ్గిల రామయ్య మహబూబాబాద్ నుంచి కారులో అతివేగంగా ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయపడిన నాగేశ్వరరావు, సునీత, ప్రజ్వల్‌ను 108లో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ నాగేశ్వరరావు మృతి చెందాడు. భార్య పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించగా కుమారుడు మహబూబాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అలాగే, కారు నడుపుతున్న గుగ్గిళ్ల రామయ్యకు సైతం గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు మృతుడి బంధువు చిన్నరామయ్య ఫిర్యాదు మేరకు కారు నడుపుతున్న గుగ్గిళ్ల రామయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు.

వాయిల్ బంధంలో విషాద ఛాయలు

గూడూరు: సొక్కం నాగేశ్వరరావు మృతితో మండలంలోని అయోధ్యపురం శివారు వాయిల్‌బంధం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మానుకోటలో పోస్టుమార్టం అనంతరం నాగేశ్వరరావు మృతదేహాన్ని స్వగ్రామం వాయిల్‌బంధం తీసుకొచ్చారు. దీంతో అమ్మమ్మ దశదిన కర్మ.. నీ చావుకు వచ్చిందా బిడ్డా అంటూ కుటుంబ, బంధుమిత్రులు బోరున విలపించారు. గురువారం అంత్యక్రియలు చేస్తామని మృతుడి బంధువులు తెలిపారు.

ఛాగల్లులో వ్యక్తి..



చంద్రయ్య (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: కారు.. బైక్‌ను వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఛాగల్లులో జరిగింది. ఎస్సై వినయ్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని మీదికొండకు చెందిన చంద్రయ్య(60) వ్యక్తిగత పనుల నిమిత్తం తన బైక్‌పై స్టేషన్‌ఘన్‌పూర్‌కు వస్తున్నాడు. ఈ క్రమంలో ఛాగల్లు సమీపంలో జాతీయ రహదారిపై వెనుక నుంచి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో చంద్రయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పొలంలో వరి దులుపుతుండగా..

● కాలుకు చుట్టుకున్న విద్యుత్ తీగ
● షాక్‌కు గురై యువకుడి మృతి
● గాలి దుమారానికి తెగి పొలంలో పడిన విద్యుత్ తీగ..



అభిషేక్ (ఫైల్)

భూపాలపల్లి రూరల్: పొలంలో ఆడ, మగ విత్తన వరి పంటను దులుపుతున్న క్రమంలో కాలుకు విద్యుత్ తీగ చుట్టుకోవడంతో షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం భూపాలపల్లి మండలం పంబపూర్‌లో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని పంబాపూర్‌కు చెందిన పిట్టల అభిషేక్ (25) అదే గ్రామానికి చెందిన పులి సలమాను అనే రైతుకు చెందిన ఆడ, మగ వరి పంటను దులపడానికి కూలీకి వెళ్లాడు. మంగళవారం సాయంత్రం వీచిన గాలి దుమారానికి పొలంలో11 కేవీ విద్యుత్ తీగ తెగిపడింది. ఈ క్రమంలో అభిషేక్ పొలంలో వరి దులుపుతుండగా అతడి కాలుకు తీగ చుట్టుకుంది. దీంతో షాక్ తగిలి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సహ కూలీలు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు వెంటనే ప్రైవేట్ వాహనంలో భూపాలపల్లి ప్రభుత్వ వంద పడకల ఆస్పత్రికి తరలించారు. అయితే అభిషేక్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అభిషేక్‌కు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు, భార్య సుకన్య ఉంది. కాగా, విద్యుత్ అధికారులు, పులిసలమాను నిర్లక్ష్యం కారణంగానే తన భర్త మృతి చెందాడని వారిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, వృద్ధాప్యంలో తమను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న కొడుకు మృతిచెందడంతో అభిషేక్ తల్లిదండ్రులు అనంతయ్య, కరుణమ్మ గుండెలవిసేలా రోదించారు.

అదుపు తప్పిన బైక్..

● కారోబార్ మృతి
● చిట్యాలలో ఘటన



కుమార్ (ఫైల్)

చిట్యాల: బైక్ అదుపు తప్పి ఓ కారోబార్ మృతి చెందాడు. ఈ ఘటనలో మంగళవారం రాత్రి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని నవాబుపేటకు చెందిన జిల్లెల కుమార్(40) కైలాపూర్ కారోబార్‌గా పని చేస్తున్నాడు. విధుల్లో భాగంగా శాంతినగర్‌లో ఉపాధిహామీ పనులు జరుగుతున్న క్రమంలో అక్కడికి వెళ్లి కూలీల వివరాలు తీసుకుని ఎంపీడీఓ కార్యాలయంలో అందజేశాడు. అనంతరం నవాబుపేటకు వెళ్తున్న క్రమంలో మండల కేంద్రంలోని సివిల్ సప్లై గోదాం మలుపు సమీపంలో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. దీంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం తెల్లవారు జామున అటువైపు వెళ్తున్న స్థానికుడు బుర్ర రఘు గౌడ్ చూసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్సై శ్రవణ్‌కుమార్ ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య కృప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, కైలాపూర్ పంచాయితీ కార్యదర్శి అజీరాబేగం.. మృతుడి భార్యకు అంత్యక్రియల నిమిత్తం రూ. 10వేల ఆర్థిక సాయం అందించారు.

లైంగిక దాడి నిందితుడికి 20 ఏళ్ల జైలు

కాటారం : బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.15వేల జరిమానా విధిస్తూ భూపాలపల్లి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పి.నారాయణబాబు బుధవారం తీర్పు వెలువరించారు. మహాముత్తారం ఎస్సై మహేందర్‌కుమార్ కథనం ప్రకారం.. మహాముత్తారం మండలం నిమ్మగూడెం గ్రామానికి చెందిన గొరవేణి అర్జున్ 2020లో మండలానికి చెందిన ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై రాజు నిందితుడు అర్జున్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి కాటారం డీఎస్పీ కిషన్ కోర్టులో చార్జ్‌షీట్ ఫైల్ చేశారు. కొన్ని రోజులుగా కోర్టులో విచారణ కొనసాగగా డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు,ఎస్సై మహేందర్‌కుమార్ ఆధ్వర్యంలో సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణలో భాగంగా జిల్లా కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ విష్ణువర్ధన్‌రావు వాదనలు వినిపించగా నేరం రుజువైంది. దీంతో జడ్జి.. అర్జున్‌కు 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.15వేల జరిమానా విధించారు.